క్లుప్తంగా

నేటి నుంచి పద్మాల అంకమ్మతల్లి కొలుపులు

మోటుమాల (కొత్తపట్నం): మోటుమాలలో గ్రామ దేవతలు సీతాలమ్మ, మహాలక్ష్మమ్మ, శ్రీ పద్మాల అంకమ్మతల్లి కొలుపులను ఈ నెల 22వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు మోటుమాల అంకమ్మతల్లి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 28వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. 27న ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అమ్మవారిని దర్శనం చేసుకుని పూజలు చేస్తారని కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు దర్నాశి వెంకన్న సంస్మరణ సభ

చీమకుర్తి: ప్రజాకళామండలి జిల్లా కోశాధికారి దర్నాశి వెంకన్న ద్వితీయ సంస్మరణ సభను సోమవారం పీ.నాయుడుపాలెం గ్రామంలో నిర్వహించనున్నట్లు ప్రజాకళామండలి జిల్లా కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కల చెదిరిన జ్ఞాపకాలను తలపోసుకుందాం రండి పేరుతో దర్నాశి వెంకన్న ప్రజాకళామండలికి చేసిన సేవలు, త్యాగాలను స్మరించుకోనున్నట్లు చెప్పారు.

బీజేపీ మండల అధ్యక్షునిగా శంకర్‌రావు

చీమకుర్తి: బీజేపీ చీమకుర్తి మండల అధ్యక్షునిగా బొడ్డు శంకర్‌రావును నియమించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంవీ రమణారావు తనను నియమించినట్లు శంకర్‌రావు తెలిపారు.

రేపు కలెక్టరేట్ వద్ద ధర్నాకు తరలిరావాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

చీమకుర్తి: ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 23న ఒంగోలు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నా కార్యక్రమానికి ఎంఆర్‌పీఎస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆ సంఘ చీమకుర్తి మండల శాఖ అధ్యక్షుడు పాటిబండ్ల జక్రయ్య కోరారు. ఎంఆర్‌పీఎస్, ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో చీమకుర్తి క్రిస్టియన్‌పాలెంలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలకు తరలిరండి అనే కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో.. వికలాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచాలని డిమాండ్ చేయనున్నట్లు తెలిపారు. ధర్నా అనంతరం ఒంగోలు హెచ్‌సీఎం కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని జక్రయ్య పిలుపునిచ్చారు.

హాకీ శిక్షణ శిబిరం ప్రారంభం



హాకీ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ జవహర్, ఎస్సై రామిరెడ్డి

చీమకుర్తి: స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో చీమకుర్తి ప్రభుత్వ హైస్కూలు క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హాకీ శిక్షణ శిబిరాన్ని జేవీవీ జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బీ జవహర్, ఎస్సై జీ రామిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు హాకీ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులందరికీ ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు కోచ్ వెంకట్ తెలిపారు. కార్యక్రమంలో పోకూరి రామకృష్ణారెడ్డి, గొల్లపూడి శ్రీహరి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రవీంద్రబాబు

ఈతముక్కల (కొత్తపట్నం): ఈతముక్కల గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. లక్ష్మీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరం ప్రారంభ కార్యక్రమంలో జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. లక్ష్మీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పది సంవత్సరాలు పూర్తి చేసుకుని 11వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రోగులకు బీపీ, సుగర్, పల్స్, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నరాల వైద్య నిపుణుడు డాక్టర్ రవీంద్రబాబు అబ్బూరి, జనరల్ సర్జరీ నిపుణులు డాక్టర్ కె.శశిధర్‌రెడ్డి, ఓబీజీ నిపుణులు డాక్టర్ లక్ష్మీరేఖ, చిన్నపిల్లల వైద్య నిపుణులు షేక్ అహ్మది సల్మా సుల్తాన్ పాల్గొని సేవలందించారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం



వాలీబాల్‌లో శిక్షణ



బాక్సింగ్‌లో చిన్నారులకు తర్ఫీదు

మార్కాపురం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కోడి రామ్మూర్తి క్రీడా సాంస్కృతిక సేవా సంఘం ఆధ్వర్యంలో గత పది రోజులుగా వేసవి ఉచిత శిక్షణ శిబిరం ఉత్సాహంగా సాగుతోంది. సుమారు 127 మంది విద్యార్థులు రోజూ బాక్సింగ్, వాలీబాల్, ఫుట్‌బాల్, కర్రసాము, నటన తదితర విభాగాల్లో ఉదయం సాయంత్రం శిక్షణ పొందుతున్నారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో గత 20 ఏళ్లుగా ఏటా వేసవిలో విద్యార్థులకు వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ఉదయం 7 గంటలకు గ్రౌండ్‌కు తీసుకొస్తున్నారు. కోచ్‌లు కాళంగి శ్రీనివాసులు, రాంబాబు, రామకృష్ణ, పిన్నిక నాగేశ్వరరావు తదితరులు ఉదయం 2 గంటలు, సాయంత్రం 2 గంటలు శిక్షణ ఇస్తున్నారు. జూన్ 10వ తేదీ వరకు శిబిరం కొనసాగుతుందని శిక్షకులు తెలిపారు. ఇంకా వ్యక్తిత్వ వికాసం, స్పోకెన్ ఇంగ్లిష్, భారత రామాయణ కథలతో పాటు దుర్యోధన, రావణబ్రహ్మ, అల్లూరి సీతరామరాజు, బాలవర్ధిరాజు.. ఇలా అనేక సాంఘిక, పౌరాణిక నాటకాల్లోని ఏకపాత్రలు కూడా నేర్పుతున్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉచితంగా వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తున్నాం. తల్లిదండ్రులు ఇక్కడికి తీసుకొస్తే చాలు. శిక్షణ అనంతరం దాతల సహకారంతో అల్పాహారాన్ని కూడా అందిస్తున్నాం.

– శ్రీనివాసులు, కోచ్



నటనలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

పోలేరమ్మతల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ తల్లి



అలంకరించిన గుంటి గంగా భవాని అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి



పూజలందుకుంటున్న పోలేరమ్మ

మార్కాపురం టౌన్: పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చన, అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని పుట్టకు, నాగశిలలకు భక్తులు పూజలు నిర్వహించారు. పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్న కేశవరెడ్డి, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

భక్తి శ్రద్ధలతో పోలేరమ్మ తిరునాళ్ల

కురిచేడు: స్థానిక కోట బజారులో వేంచేసి ఉన్న శ్రీపోలేరమ్మ తిరునాళ్ల ఆదివారం భక్తి శ్రద్ధలతో జరిగింది. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పోలేరమ్మ తల్లితోపాటు పోతురాజుకు భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, అన్నదానం కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రికి రెండు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, సహస్రనామ, కుంకుమ పూజలు, అఖండహారతి నిర్వహించారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

గుంటి గంగా భవాని అమ్మవారికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి గంగా భవాని అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పూజారులు విజయలక్ష్మి, ప్రకాశరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు పన్నెండు చీరల బహూకరించారు. ఆలయానికి రూ. 17,234 ఆదాయం వచ్చినట్లు ఆర్‌ఏ శ్రీనివాసరావు తెలిపారు. భక్తులకు సౌకర్యాలను ఈఓ భాస్కర్ రెడ్డి పర్యవేక్షించారు.



పోతురాజుకు మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

29న సీతారామస్వామి ద్వితీయ వార్షికోత్సవాలు

గిద్దలూరు రూరల్: మండలంలోని బురుజుపల్లె గ్రామంలో గల సీతారామస్వామి ద్వితీయ వార్షికోత్సవాలను ఈ నెల 29వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు 28వ తేదీ రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.50 వేలు అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 94415 79589 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రాజీవ్‌గాంధీకి నివాళులు



చీమకుర్తిలో రాజీవ్‌గాంధీకి నివాళులర్పిస్తున్న నాయకులు

చీమకుర్తి: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆదివారం చీమకుర్తిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సంతనూతలపాడు ఇన్‌చార్జి తుమ్మల సుబ్బారావు, నాయకులు పాల్గొన్నారు.

పేద మహిళకు నిత్యావసరాల అందజేత



మహిళకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

ఒంగోలు అర్బన్: స్థానిక అన్నవరప్పాడు కాలనీలో నివసిస్తున్న పేద మహిళకు సూర్యశ్రీ ట్రస్ట్ ఆధ్వర్యంలో బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను ఆదివారం అందజేశారు. భర్త మరణించడంతో పాటు ఆమె కాలు విరిగి అనారోగ్యంతో ఉండటం, కుమారుడు సాయి సుగర్, ఊపిరితిత్తుల్లో నెమ్ముతో కుటుంబ పోషణ కష్టంగా మారిన నేపథ్యంలో సాయి మిత్రుడు కిరణ్ ద్వారా విషయం తెలుసుకున్న సూర్యశ్రీ ట్రస్ట్ వంద రోజులకు సరిపడా బియ్యం, నిత్యావసరాలు అందజేసింది. ట్రస్ట్ సెక్రటరీ సర్దార్ బాషా, మారెళ్ల సుబ్బారావు, చిక్కాల కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, ఉత్తరాయణం జ్యేష్ట మాసం, మృగశిర నక్షత్రం, తదియ తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

బైకును ఢీకొట్టిన కారు

బల్లికురవ: కారు బైకును ఢీకొట్టటంతో బైకిస్టు తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈఘటన శనివారం జరగగా వైద్యశాల నుంచి అందిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదుతో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై వీ. వేమన తెలిపారు. మండలంలోని గొర్రెపాడు గ్రామానికి చెందిన జీ. భూపతిరెడ్డి పనుల నిమిత్తం గ్రామం నుంచి కొప్పరపాడు గ్రామానికి బైకుపై వెళ్తున్నాడు. వినుకొండ రోడ్డులో నుంచి నార్కెట్‌పల్లి–మేదరమెట్ల నామ్ రహదారిలో వస్తుండగా ఒంగోలు వైపు వెళుతున్న కారు బైకును ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రగాయాలైన భూపతిని స్థానికులు చికిత్స నిమిత్తం నరసరావుపేట వైద్యశాలకు తరలించారు.

పృథులాపురికి నిధుల వరద

- పొదిలికి అమృత్ పథకంలో రూ.110 కోట్లు
- రూ.50 కోట్ల నిధులతో సాగర్‌నీరు
- ప్రధాన రహదారి అభివృద్ధికి రూ.11 కోట్లు



పట్టణ ప్రధాన రహదారి కర్నూలు-నంద్యాల రోడ్డు

పొదిలి: పొదిలి వాసుల చిరకాల వాంఛ నెరవేరబోతోంది. ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న పెద్ద చెరువుకు సాగర్ నీటి తరలింపు పథకం సాకారం కానుంది. మరో వైపు అమృత్ పథకంలో రామతీర్థం నీరు ఇంటింటికీ చేరనుంది. తాగునీటి సమస్య తీర్చే డబుల్ ధమాకా పథకాలు మంజూరయ్యాయి. ఇటీవల మార్కాపురం వచ్చిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పథకం పనులు చేపట్టేందుకు ఉద్దేశించిన శిలాఫలకం ఆవిష్కరించారు. రూ.50 కోట్ల నిధులతో కొత్తరెడ్డిపాలెం సమీపం నుంచి దర్శి సాగర్ కెనాల్ నుంచి, పెద్ద చెరువు వరకు సుమారు 17 కిలోమీటర్లు పైపులైన్ ఏర్పాటు చేస్తారు. ఈపైపులైన్ ద్వారా పెద్ద చెరువుకు సాగర్ నీటితో నింపుతారు. ఈ మేరకు పథకం కోసం అవసరమైన నీటి కేటాయింపులు కూడా పథకం నిధులతో పాటే మంజూరయ్యాయి.

అమృత్ 2.0 పథకంలో రూ.110 కోట్లు

రాష్ట్ర నీటి ప్రణాళికలో భాగంగా, అమృత్ 2.0 పథకంలో భాగంగా పొదిలి నగర పంచాయతీకి రూ.110 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కేవలం మంచినీటి కోసమే ఈ నిధులను వినియోగిస్తారు. రామతీర్థం జలాశయం నుంచి పైపులైన్ ద్వారా పొదిలికి నీటిని తరలిస్తారు. అవసరమైన చోట్ల ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మాణం, మొత్తం కొత్త పైపులైన్లు, ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు కోసం ఈ నిధులు కేటాయించారని అధికారులు చెప్పారు.

ప్రధాన రహదారి అభివృద్ధికి రూ.11 కోట్లు మంజూరు

నగర పంచాయతీ అయిన తరువాత అభివృద్ధికి నిధులు పెద్ద ఎత్తున మంజూరు కావటం ఇదే ప్రథమం. ప్రధాన రహదారి ఇరుగ్గా ఉండటం, ఇరు వైపులా వర్షపు నీరు నిలబడటంతో రాక పోకలకు సమస్యగా మారింది. దీంతో సమస్య శాశ్విత పరిష్కారం కోసం ఎమ్మెల్యే కేపీ.నాగార్జునరెడ్డి చేసిన ప్రతిపాదనలకు, స్పందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.11 కోట్ల నిధులు మంజూరు చేశారు. పూర్తయితే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం కావటంతో పాటు, డ్రైనేజీ సమస్య తీరుతుంది.

పనులు సత్వరమే జరిగేలా చేస్తాం

మొత్తం రూ.171 కోట్ల నిధులను సీఎం మంజూరు చేశారు. మంచినీటికి, ప్రధాన రహదారి అభివృద్ధి కోసం నిధులు వినియోగిస్తారు. తాగునీటి సమస్య శాశ్వితంగా పరిష్కారమవుతుంది. సాగర్‌నీరు, రామతీర్థం నీరు అందుబాటులోకి వస్తుంది. నిధులు మంజూరు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. ఆ పనులు త్వరితగతిన జరిగేలా ప్రత్యక్ష పర్యవేక్షణ చేస్తాం. ప్రత్యేకించి పొదిలి ప్రజల తరపున సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– కేపీ నాగార్జునరెడ్డి, ఎమ్మెల్యే

తీరంలో సండే సందడి



వాడరేవులో స్నానం చేస్తున్న పర్యాటకులు

చీరాల టౌన్: వేసవిలో ఎండలు దంచికొడుతున్నా.. పర్యాటకులు మాత్రం తీరానికి పోటెత్తారు. ఆదివారం మండలంలోని వాడరేవు సముద్రతీర ప్రాంతం పర్యాటకులతో కిటకిటలాడింది. ఎండలు విపరీతంగా కాస్తుండటం, వేసవి సెలవులు కావడంతో సముద్ర తీరం ఒడ్డున సేదతీరేందుకు పర్యాటకులు వాడరేవు తీరానికి చేరుకున్నారు. చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాలకు చెందిన ప్రజలతో పాటు గుంటూరు, విజయవాడ, తెలంగాణా రాష్ట్రంలోని పట్టణాలకు చెందిన వారు సైతం కుటుంబ సభ్యులతో వాడరేవు చేరుకుని సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించి ఆనందంగా గడిపారు. సెలవుదినాల్లో వాడరేవుకు పర్యాటకులు అధికంగా వస్తారని తెలిసినప్పటికీ పంచాయతీ అధికారులు తీరం ఒడ్డున కనీస సౌకర్యాలు కూడా కల్పించలేకపోయారు. సముద్రంలో స్నానం ఆచరించిన మహిళలు బట్టలు మార్చుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. తీరం ఒడ్డున మంచినీటి సౌకర్యం లేక యాత్రీకులు అవస్థలు పడ్డారు. అధికారులు తీరును పర్యాటకులు విమర్శిస్తున్నారు.

ఎయిడ్స్ నియంత్రణ అందరి బాధ్యత



కొవ్వొత్తులతో స్మారక ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఒంగోలు అర్బన్: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ అందరి బాధ్యతని, ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకుని నియంత్రణకు కృషి చేయాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డి.సురేష్‌కుమార్ కోరారు. ఆదివారం హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌తో మరణించిన కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ వారి ఆత్మకు శాంతి కలగాలని అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశం భవనం నుంచి బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. సురేష్ మాట్లాడుతూ అవగాహన ఉంటే ఎయిడ్స్‌ను పూర్తిగా అరికట్టవచ్చన్నారు. ప్రోగ్రాం మేనేజర్ రంగారావు, బీవీ సాగర్, నాగేంద్ర, విహాన్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.